సీఎంకు శుభాకాంక్షలు..

ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
- అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి





నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.
- ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి



ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా రాజకీయ కమిటీ చైర్మన్‌గా రవిగుప్తాకు నియామక పత్రం అందజేస్తున్న అమరవాది లక్ష్మీనారాయణ

ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ చైర్మన్‌గా రవి

ఎల్‌బీనగర్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ చైర్మన్‌గా కొత్త రవిగుప్తా నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ బుధవారం రవిగుప్తాకు నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా రవిగుప్తా మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణతో పాటు ఆర్గనైజింగ్ సెక్రటరీ రేణిగుంట్ల గణేష్‌గుప్తా, పొలిటికల్ చైర్మన్ చింతల రవికుమార్‌గుప్తా, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మయ్యగుప్తాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశంగుప్తా, జిల్లా అధ్యక్షుడు గందె సురేష్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి బిళ్లకంటి కిరణ్‌కుమార్‌గుప్తా, కోశాధికారి వనపర్తి బద్రీనాథ్‌గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాశెట్టి ప్రభాకర్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు రాహుల్‌గుప్తా పాల్గొన్నారు.

బాలాపూర్ చెరువును కబ్జా బారి నుంచి కాపాడాలి



చెరువుకట్టను చదును చేసి గేటు ఏర్పాటు చేసిన దృశ్యం

సరూర్‌నగర్ : బాలాపూర్‌లోని సర్వే నంబర్ 22, 23(పార్ట్)లలో గల గేదెలకుంట చెరువును కొందరు రాజకీయ నాయకులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, సదరు కబ్జాను వెంటనే అడ్డుకుని చెరువును కాపాడాలని స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ యువజన సంఘం ప్రతినిధులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను కోరారు. చెరువు కబ్జాపై ఇటీవల తాము ఆయా విభాగాల అధికారులకు ఫిర్యాదు చేశామని, అయినా కబ్జాదారులు పనులు ఆపడంలేదని చెరువుకట్టను చదును చేసి క్రమంగా చెరువులోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్నారని సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ ఆరోపించారు. అధికారులు స్పందించి చెరువును కబ్జాబారి నుంచి కాపాడడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

హనుమాన్ ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ

సరూర్‌నగర్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ కింది వార్డులోని విశ్వక్సేన గణపతి సహిత సీతారామ భక్తాంజనేయ స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ముద్రించిన 2025-నూతన సంవత్సరం క్యాలెండర్‌ను బుధవారం ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగు ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి కందాడి శ్రీరాంరెడ్డి, కోశాధికారి తర్రె మల్లేశ్‌యాదవ్, కార్యదర్శులు అందెల శ్రీరాములుయాదవ్, మన్నెం బుచ్చిరెడ్డి, సభ్యులు కళ్లెం నర్సింహారెడ్డి, యెల్చెల భాస్కర్‌రెడ్డి, ముద్దం వెంకట్‌రెడ్డి, తోట శ్రీధర్‌రెడ్డి, యెలకొండ శ్రీధర్‌రెడ్డి, యెల్చెల దయాకర్‌రెడ్డి, తర్రె అంజయ్యయాదవ్, కార్పొరేటర్ జి.ఇంద్రసేన, నాయకులు ఇంద్రపల్లి యాదగిరి, అందెల ఐలయ్యయాదవ్, యెల్చెల రామ్మోహన్‌రెడ్డి, ఆలయ అర్చకులు సంపత్‌కుమారాచార్యులు, శ్రీధరాచార్యులు, పవన్‌కుమారాచార్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



భూలక్ష్మీనగర్ కాలనీ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, రవికిరణ్

భూలక్ష్మీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం..

వనస్థలిపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ భూలక్ష్మీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను బుధవారం హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్నలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసులు ఐక్యంగా ఉంటూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి పొనుగుపాటి రవికిరణ్, ఉపాధ్యక్షుడు శ్రీధర్, సహాయ కార్యదర్శి సామ దామోదర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు విజయ రంగి, విద్యులత, నీలికిరణ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణ

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాలను మండలంలోని కవాడిపల్లిలో బుధవారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సిద్దు, హర్షిత్, శివ, వేణు, ఉదయ్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కొత్తపేట : ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం హిందూపూర్‌కు చెందిన లావణ్య(26) శ్రీకాకుళంకు చెందిన మెడికల్ రిప్రజెంటేటివ్ మోహన్‌రావు(28) రెండేళ్ల నుంచి ప్రేమించుకున్నారు. డిసెంబర్ 12న వారిద్దరూ ఎల్బీనగర్ ఎన్టీఆర్‌నగర్ హనుమాన్ ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. ఇద్దరూ బైరామల్‌గూడ ఎస్వీకాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. బుధవారం సాయంత్రం అతడు బయటకు వెళ్లి వచ్చే సరికి బెడ్రూంలో ఆమె ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మహిళ ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమని పోలీసులు భావిస్తున్నారు.



నూతన సంవత్సరం సందర్భంగా భక్తులతో కిటకిటలాడిన కొత్తపేటలోని అష్టలక్ష్మీ ఆలయం



దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయి సంస్థాన్‌లో భక్తుల రద్దీ



కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ఎమ్మెల్యే సబితారెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు కామేశ్‌రెడ్డి, నర్సిరెడ్డి తదితరులు

కొత్త ఉత్సాహం.. కోర్కెలు ఘనం

- ఎటు చూసినా నూతన సంవత్సరానందమే
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- భగవంతుడికి భారీగా మొక్కులు

మన్సూరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్, మహేశ్వరం, మలక్‌పేట్ నియోజకవర్గాల పరిధిలో బుధవారం ఏ కాలనీ, ఏ ప్రాంతం, ఏ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలను చూసినా నూతన సంవత్సర-2025 ఆనందం వెల్లివిరిసింది. మంగళవారం రాత్రి పాత సంవత్సరం-2024కు ఘనమైన వీడ్కోలు పలికిన ప్రజలు.. అదే ఉత్సాహంతో కేక్‌లు కట్‌చేసి బాణసంచాలు పేల్చి కొత్త ఏడాదికి ఘనమైన స్వాగతం పలికారు. ముఖ్యంగా మహిళలు ఉదయాన్నే లేచి తమ ఇంటి ముందు వాకిళ్లలో కలాపి చల్లి ఆకర్షణీయంగా రంగురంగుల ముగ్గులు వేశారు. అనంతరం ఆలయాలకు పోటెత్తారు. అదేవిధంగా తమ తమ బంధువులు, మిత్రులు, సహచరులు, రాజకీయ ప్రముఖులను కలుస్తూ కొత్త ఏడాది శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఈ ఏడాది అంతా మంచి జరగాలని ఆకాక్షించారు. ముఖ్యంగా తమ తమ కోర్కెలు నెరవేర్చాలంటూ పరిసర ప్రాంతాల్లోని ఆలయాలను సందర్శించడంతో ఏ ఆలయాన్ని చూసినా భక్తులతో కిటకిటలాడాయి.

కోమటిరెడ్డికి ఉప్పల శుభాకాంక్షలు

నూతన సంవత్సరం 2025ను పురస్కరించుకుని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బుధవారం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో టీపీసీసీ ప్రచారక మిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసిన ఉప్పల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

బడంగ్‌పేట్, మీర్‌పేట్‌లలో..

సరూర్‌నగర్: నూతన సంవత్సరం-2025 వేడుకలను బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. మంగళవారం రాత్రి పొద్దుపోయేదాకా 2024కు వీడ్కోలు పలుకుతూ సంబరాల్లో మునిగిపోయిన ప్రజలు.. బుధవారం తెల్లవారు జామున ఆలయాల బాట పట్టారు. మంగళవారం అర్ధరాత్రి(12 గంటలు) కాగానే కేక్ కట్‌చేసి, బాణసంచా కాల్చి కేరింతలు కొట్టారు. 2025కు స్వాగతం పలుకుతూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇక బుధవారం ఉదయం ఇళ్ల ముందు కళ్లాపి చల్లి రంగవల్లులు తీర్చిదిద్ది 'హేపీ న్యూ ఇయర్-2025' అని రాశారు అనంతరం స్థానిక ఆలయాలకు వెళ్లి స్వామి వారి దర్శనం చేసుకుని.. ఈ ఏడాది అంతా మంచే జరగాలని దేవుళ్లను వేడుకున్నారు. జిల్లెలగూడలోని శ్రీమత్స్యావతార వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. బడంగ్‌పేట్‌లోని కాశీబుగ్గ క్షేత్రం, ఉమామహేశ్వరస్వామి ఆలయం, నాదర్‌గుల్‌లోని శివాలయం, హనుమాన్ ఆలయం, సాయి మందిరం, మీర్‌పేట్‌లోని కాశీనర్మదేశ్వరాలయం, బాలాపూర్‌లోని వేణుగోపాల స్వామి ఆలయం, శివాలయం తదితర ఆధ్యాత్మిక ప్రదేశాలు భక్తులతో సందడిగా కనిపించాయి. బాలాపూర్‌లోని దేవతలగుట్టపై గల పురాతన హనుమాన్ ఆలయంలో మంగళవారం ఉదయం 11.30 గంటల నుంచి బుధవారం ఉదయం 11.30గంటల వరకు 24గంటల పాటు నిర్విరామంగా శ్రీరామ చరిత్ మానస్ అఖండ పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కర్మన్‌ఘాట్‌లో..



భక్తితో నమస్కరిస్తున్న భక్తులు

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో ప్రసిద్ధి గాంచిన హనుమాన్ ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురష్కరించుకొని వేకువ జాము నుంచే వేలాది మంది భక్తులు ధ్యానాంజనేయస్వామి, వినాయకస్వామి దర్శనం కోసం బారులు తీరారు. స్వామి దర్శనం కోసం వాహనాల పూజాస్థలం నుంచి కోనేరు పక్కనుంచి లోనికి వెళ్లేందుకు రెండు వరసల చొప్పున భక్తులు బారులు తీరారు. ఆలయాన్ని రంగురంగుల పూలు, అరటి మండలతో అలంకరించారు. భక్తుల రాకను పురష్కరించుకొని ఆలయంలో ఈవో ఎన్.లావణ్య ప్రత్యేక క్యూలైన్స్, టెంట్లు, సేదతీరేందకు కుర్చీలు వేయించారు. స్వామి వారి ప్రసాదాల కౌంటర్ల వద్ద భక్తులు బారులు తీరారు. నూతన సంవత్సరం, రాష్ట్ర ప్రభుత్వం సెలువు దినం ప్రకటించడంతో భక్తులు ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి పోటెత్తారు. కార్లు, ద్విచక్ర వాహనాలతో ఆలయ పరిసరాలు నిండిపోయాయి. ఆలయం వెలుపల ప్రధాన రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి ట్రాఫిక్‌కు ఆటంకం ఏర్పడింది.

హయత్‌నగర్, తుర్కయంజాల్‌లలో..

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్, తుర్కయంజాల్ ప్రాంతాల్లో ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు అర్ధరాత్రి వరకు వేచి ఉండి 2024కి వీడుకోలు పలికి కొత్త సంవత్సరం 2025కి స్వాగతం పలుకుతూ కేక్‌లు కట్‌చేశారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. యువకులు కేరింతలు కొడుతూ రోడ్డుపైన తిరిగారు. మహిళలు వాకిళ్ల ముందు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రంగు రంగు ముగ్గులు వేశారు.

కిటకిటలాడిన ఆలయాలు..

ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని హయత్‌నగర్ డివిజన్, తుర్కయంజాల్ ప్రాంతాల్లోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. తుర్కయంజాల్ ఏవీనగర్‌లోని ఆది వేంకటేశ్వర స్వామి, ఇం జాపూర్ వేంకటేశ్వరస్వామి, తొర్రూర్ రంగనాథస్వామి, కొహెడా వేణుగోపాలస్వామి, బ్రాహ్మణపల్లి వేణుగోపాలస్వామి, కుంట్లూర్ రామాలయం, హయత్‌నగర్ సాయిబాబా ఆలయం, శాంతినగర్‌లోని సోమేశ్వరాలయం, కంఠమహేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

దిల్‌సుఖ్‌నగర్: ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దిల్‌సుఖ్‌నగర్ సాయి సంస్థాన్, కనకదుర్గా ఆలయం, శివాలయం, గడ్డిఅన్నారం వీరవెంకట సత్యనారాయణస్వామి ఆలయం, వీవీనగర్ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ నిర్వాహకులు ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కొత్తపేట: ఆంగ్ల నూతన సంవత్సరం మొదటి రోజు బుధవారం తెల్లవారుజాము నుంచే కొత్తపేట ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. డివిజన్ పరిధిలోని స్నేహపురికాలనీలో వెలసిన గోదా సమేత పద్మావతీ వేంకటేశ్వరాలయం విజయవినాయక ఆలయం, అయ్యప్ప స్వామి, కాశీవిశ్వేశ్వరాలయం, ప్రసన్నాంజనేయస్వామి ఆలయాల్లో అదే విధంగా మోహన్‌నగర్ ఎస్బీహెచ్‌కాలనీలోని హరిహరక్షేత్రం, సత్యానగర్‌లోని హరిహరక్షేత్రంలో గల వేంకటేశ్వరాలయాలు, ఎస్ఆర్ఎల్, కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయం, గాయత్రీనగర్‌కాలనీలో గల గణేషాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు.



మంత్రి కోమటిరెడ్డికి జ్ఞాపికను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్



సీఎం రేవంత్‌రెడ్డిని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌తో కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సంఘీరెడ్డి



కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో స్వామి దర్శనం కోసం క్యూలో బారులు తీరిన భక్తులు



స్నేహపురి వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక అర్చనలు చేయిస్తున్న భక్తులు



నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ చంపాపేటలో ఇళ్ల ముందు ముగ్గులు వేస్తున్న బాలికలు

వాహనాల తనిఖీల్లో ఏడు కిలోల గంజాయి పట్టివేత

- మూడు వాహనాలు సీజ్
- నలుగురి అరెస్ట్

చంపాపేట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కంచన్ బాగ్ పోలీసులు జరిపిన వాహనాల తనిఖీల్లో 7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ లింగరాజు తెలిపిన వివరాల ప్రకారం .. ఒడిశా నుంచి దూల్‌పేటకు మూడు ద్విచ క్ర వాహనాల ద్వారా గంజాయిని తరలి స్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు డీఎంఆర్ఎల్ చౌరస్తా సమీపంలో సాయి బాబా ఆలయం ఎదుట బుధవారం సాయంత్రం ఐదున్నర గంటల ప్రాంతంలో వాహనాల తనిఖీలు చేపట్టారు.

ఒడిశాకు చెందిన బిశ్వజిత్ అధికారి(30) అతని భార్య బిచిత్ర విశ్వాస్(20) ద్విచక్ర వాహనంపై మూడు కిలోల గంజాయి, ఒడిశాకు చెందిన తపన్ మండల్(50) ద్విచక్ర వాహనం పై రెండు కిలోల గంజాయి, దూల్‌పేటకు చెందిన వివేక్‌సింగ్(22) ద్విచక్ర వాహనం పై రెండు కిలోల గంజాయిని తరలి స్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు, మూడు వాహనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

హయత్‌నగర్ : ముందున్న బైకును వెనుక నుంచి వస్తున్న బైకు వేగంగా ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేటకు చెందిన సామల నిఖిల్(20) బాబాయ్ వద్ద ధనుష్‌తో కలిసి మంగళవారం రాత్రి ఎల్బీనగర్ వైపు నుంచి హయత్‌నగర్ వైపుకు వస్తు న్నారు. బైకు ఆర్టీసీ కాలనీ వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వస్తున్న బైకు ఢీకొట్టింది ఈ ప్రమాదంలో నిఖిల్, ధనుష్యలు రోడ్డుపై పడి తీవ్రగాయా లకు గురయ్యారు. వెంటనే స్థానిక పోలీసులు ఇద్దరిని సన్‌రైజ్ ఆస్పత్రిలో చేర్పించారు నిఖిల్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వెనుక నుంచి బైకును ఢీకొట్టిన గణేష్‌కు కూడా స్వల్పగాయాలు అయ్యాయని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తగ్గేదేలే..

- చుక్కేసి పోలీసులకు చిక్కిన మద్యంప్రియులు
- నూతన సంవత్సర వేడుకల్లో పెరిగిన డీడీ కేసులు
- 2023 డిసెంబర్ 31న 535
- 2024 డిసెంబర్ 31న 619

కొత్తపేట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రాచకొండ ట్రాఫిక్ పోలీసులు మద్యంప్రియులకు చెక్‌పెట్టారు. అయినప్పటికీ తగ్గేదేలేదన్నట్లు మద్యంప్రియులు చుక్కేసి పోలీసులకు చిక్కారు. ఎల్బీనగర్‌లో ఫ్లైఓవర్‌పై రాకపోకలు నిలిపివేశారు. దీంతో ఫ్లైఓవర్ నిర్మానుష్యంగా మారింది. పలు కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. రాచకొండ ట్రాఫిక్ జోన్స్ పరిధిలో 2025 -నూతన సంవత్సర వేడుకల్లో డీడీ కేసులు స్వల్పంగా పెరిగాయి. 2023 డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సర వేడుకల సమయంలో ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 535 డీడీ కేసులు నమోదు కాగా 2024 డిసెంబర్ 31 రాత్రి వాటి సంఖ్య 619గా రికార్డయింది. రాచకొండ సీపీ సుధీర్‌బాబు నేతృత్వంలో 2024 డిసెంబర్ 31 రాత్రి ట్రాఫిక్ జోన్ - 1, 2ల పరిధుల్లో పలు కీలక కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు డీడీ తనిఖీలు పకడ్బందీగా నిర్వహించారు. ట్రాఫిక్ అధికారులు తెలిపిన వివరాలు.. ట్రాఫిక్ జోన్ -1 పరిధిలోని మల్కాజిగిరి డివిజన్‌లోని మల్కాజిగిరి, ఉప్పల్, కుషాయిగూడ, ఘట్‌కేసర్ ట్రాఫిక్ పీఎస్‌లు, (230 కేసులు) భువనగిరి డివిజన్‌లోని చౌటుప్పల్, భువనగిరి, యాదాద్రి ట్రాఫిక్ పీఎస్‌లు, లా అండ్ ఆర్డర్ పీఎస్‌ల పరిధి(106 కేసులు)లో మొత్తం 336 డీడీ కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా ట్రాఫిక్ జోన్ - 2లోని ఎల్బీనగర్ డివిజన్‌లోని ఎల్బీనగర్, వనస్థలిపురం ట్రాఫిక్ పీఎస్‌లు(232 కేసులు), మహేశ్వరం డివిజన్‌లోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ట్రాఫిక్ పీఎస్‌లు, లా అండ్ ఆర్డర్ పీఎస్‌ల పరిధి (51 కేసులు)లో మొత్తం 283 డీడీ కేసులు నమోదయ్యాయి. రెండు జోన్లలో మొత్తం 619 డీడీ కేసులు నమోదయ్యాయి.



డీడీ పరీక్షల్లో భాగంగా ఓ వ్యక్తికి బ్రీత్ అనలైజర్ చెక్ చేస్తున్న ట్రాఫిక్ అధికారి

డీడీ కేసుల్లో బైక్ రైడర్లే ఎక్కువ

డీడీ తనిఖీల్లో బైక్ రైడర్ల సంఖ్య పట్టుబడిన బైక్ రైడర్ల సంఖ్య మల్కాజిగిరి డివిజన్‌లో 198 ఉండగా భువనగిరి డివిజన్‌లో 80గా (మొత్తం 278) నమోదయింది. వారి సంఖ్య ఎల్బీనగర్ డివిజన్‌లో 209 ఉండగా మహేశ్వరం డివిజన్‌లో 39గా(మొత్తం 248) నమోదయింది. రెండు జోన్లలో 526మంది ద్విచక్ర వాహనదారులపై డీడీ కేసులు నమోదయ్యాయి. మిగతా వాహనదారుల్లో మల్కాజిగిరి, భువనగిరి డివిజన్లలో 13మంది ఆటో డ్రైవర్లపైన, 43 మంది కారు డ్రైవర్ల పైన డీడీ కేసులు నమోదు కాగా, ఎల్బీనగర్, మహేశ్వరం డివిజన్లలో 13మంది ఆటో డ్రైవర్లపైన, 21 మంది కారు డ్రైవర్ల పైన డీడీ కేసులు నమోదయ్యాయి. ట్రాఫిక్ జోన్- 2 డీసీపీ వీ.శ్రీనివాస్ డిసెంబర్ 31 మంగళవారం రాత్రి పలు ప్రాంతాల్లో డీడీ తనిఖీలను పర్యవేక్షించారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు సీఐ నాగరాజు, ఎస్ఐలు రవికుమార్, కృష్ణ, మధుబాబు, శంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్బీనగర్‌లో 108 ..

రాచకొండ ట్రాఫిక్ జోన్-2 ఎల్బీనగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో నూతన సంవత్సర వేడుకల వేళ 108 డీడీ కేసులు నమోదయ్యాయి. మంగళవారం రాత్రి ప్రధాన కూడళ్ల వద్ద మూడు ట్రాఫిక్ పోలీసు అధికారుల బృందాలు సిబ్బందితో మద్యంమత్తులో వాహనాలు నడుతున్న వారికి బీఏసీ పరీక్షలు నిర్వహించారు. మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురు కారు డ్రైవర్లపై, ముగ్గురు ఆటో డ్రైవర్లపైన, 101 ద్విచక్ర వాహనదారులపైన డీడీ కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ జోన్ 2 డీసీపీ వీ.శ్రీనివాస్ రాత్రి పలు ప్రాంతాల్లో డీడీ తనిఖీలను పర్యవేక్షించారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు సీఐ నాగరాజు, ఎస్ఐలు రవికుమార్, కృష్ణ, మధుబాబు, శంకర్ సిబ్బంది పాల్గొన్నారు.



దిల్‌సుఖ్‌నగర్‌లో డ్రంకెన్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న ట్రాఫిక్ డీసీపీ ఆర్.వెంకటేశ్వర్‌రావు, పక్కన మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్

మలక్‌పేటలో 96..

చాదర్‌ఘాట్: మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 96మంది వాహనదారులు పట్టుబడ్డారు. వీరిలో 12 కార్ల డ్రైవర్లు ఉండగా మిగతా 84మంది ద్విచక్ర వాహనదారులున్నారని మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్, మూసారాంబాగ్ శ్రీపురంకాలనీ చౌరస్తాలో డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించినట్లు ఆయన వివరించారు. ట్రాఫిక్ డీసీపీ ఆర్.వెంకటేశ్వర్‌రావు దిల్‌సుఖ్‌నగర్‌లో డ్రంకెన్ డ్రైవ్‌ను పరిశీలించారు.

మద్యంప్రియుల హల్‌చల్..

సైదాబాద్: చంపాపేట ప్రధాన రహదారిపై నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో మద్యంప్రియులు సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసులకు చుక్కలు చూపించారు. పట్టుబడ్డ మద్యంప్రియులు పోలీసులకే వార్నింగ్‌లు ఇచ్చారు. తమపై కేసులు నమోదు చేస్తే తామెంటో చూపిస్తామని మద్యంప్రియులు హల్‌చల్ చేశారు. మరికొందరు పోలీసుల కాళ్లవేళ్ల పడ్డారు. సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో 91 కేసులు, నమోదు కాగా 65బైకులతో పాటు కార్లు, ఆటోలను సీజ్ చేశారు.



డీడీ పరీక్షలను పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ జోన్ -2 డీసీపీ శ్రీనివాస్

తనిఖీలు గుర్తించి పరుగులు

చంపాపేట ప్రధాన రహదారిపై పోలీసుల తనిఖీలు గమనించిన కొందరు మద్యంప్రియులు బైక్‌లను వదిలివేసి రోడ్లపై పరుగులు పెట్టారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. మరి కొందరు పట్టుబడ్డ మద్యంప్రియులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అర్ధరాత్రి వరకు వైన్స్, బార్లు ఓపెన్ చేసి డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు చేయడమేంటని ప్రశ్నించారు.

సంయమనం పాటించిన పోలీసులు

తనిఖీల్లో కొందరు మద్యంప్రియులు దురుసుగా ప్రవర్తించినా సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు సంయమనం పాటించారు. మరికొందరు తనిఖీలు చేసుకోమని భీష్మించిన వారిని సముదాయించి పరీక్షలు నిర్వహించారు. పోలీసులపై తిరగబడ్డ వారికి నచ్చచెప్పి పంపించారు.